కేటీఆర్‌ను కలిసిన సోషల్ మీడియా కన్వీనర్

కడ్తాల్, అక్టోబర్ 17: తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కడ్తాల్ మండలం నుంచి యూత్ వింగ్ నాయకులు భారీగా తరలివెళ్లారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కడ్తాల్ మండల సోషల్ మీడియా కన్వీనర్ అండేకార్ సాయికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించినట్లు సాయికుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసుల కృషి

రంగాపూర్‌లో యువతకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రాజు

మంచాల, అక్టోబర్ 17: ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ వ్యవస్థ నిరంతరం పని చే స్తుందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని రంగాపూర్‌లో ప్రజల వద్దకు పోలీసులు కార్యక్రమాన్ని మంచాల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు యువత సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు, మహిళలపై లైంగిక దాడులు, సీసీ కెమెరాల ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంచాల సీఐ మధు, ఎస్సై లాలయ్య, ఏఎస్సై సతీశ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ సమావేశానికి తరలిన శ్రేణులు

సమావేశానికి తరలివెళ్తున్న బీఆర్‌ఎస్వీ శ్రేణులు

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 17: నగరంలోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశానికి ఇబ్రహీంపట్నం నుంచి బీఆర్‌ఎస్వీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు చేసిన సూచనలు, సలహాలు తూచా తప్పకుండా పాటిస్తామని బీఆర్‌ఎస్వీ శ్రేణు లు తెలిపారు. సమావేశానికి తరలివెళ్లిన వా రిలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్, నాయకులు ఆంగోత్ ప్రవీణ్‌నాయక్, మడుపు శివసాయి, రాఘవేంద్ర, మ నీష్ రెడ్డి, చంద్రకాంత్, శివకుమార్, కాజు, వీరేశ్ గౌడ్, కొండ్రు ప్రవీణ్, కరుణాకర్, దానయ్య, శివప్రసాద్‌గౌడ్, రాజు, వెంకటేశ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థికి చేయూత

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న రియల్ ఎస్టేట్ యజమాని రాములు

ఆమనగల్లు, అక్టోబర్ 17: మండల పరిధిలోని శంకర్‌కొండ తండాకు చెందిన నేనావత్ పాండు కుమారుడు నేనావత్ శ్రీకాంత్ ఐఐటీ కాన్పూర్‌లో ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. శ్రీకాంత్ ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న అనన్య రియల్ ఎస్టేట్ యజమాని మండ్లీ రాములు సోమవారం నేనావత్ శ్రీకాంత్‌కు రూ.40 వేల ఆర్థిక సాయాన్ని అందించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. తన వంతు సాయం చేశానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వస్పుల మానయ్య, ఆంజనేయులు, పత్య, రాంజ్యా, శేఖర్, జగ్గురామ్, చంద్రునాయక్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరు

సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబర్ 3: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క సహకారంతో నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ నుంచి రూ.204 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆర్‌అండ్ బీ నుంచి వెల్దండ మండల పరిధిలోని కొత్త గేట్ నుంచి కల్వకుర్తి పట్టణం వరకు నాలుగు లేన్ల బీటీ రోడ్డుకు రూ. 30 కోట్లు, రెండు లేన్ల నిర్మాణానికి వెల్దండ నుంచి సిరస్సనగండ్ల బీటీ రోడ్డుకు రూ.40 కోట్లు, జూపల్లి నుంచి వంగూర్ గేట్ వరకు బీటీ రోడుకు రూ.9 కోట్లు, కోనాపూర్ నుంచి మాడుగుల బీటీ రోడ్డుకు రూ.45 కోట్లు, మాడుగుల రోడ్డు నుంచి దేవరకొండ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్లు, తలకొండపల్లి చౌరస్తా నుంచి కోత్ర చౌరస్తా వరకు రూ.35 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. పంచాయతీ రాజ్ నుంచి రూ.15 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో వెల్దండ, కల్వకుర్తి, మాడుగుల మండల పరిధిలో బీటీ రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీబీ మెంబర్ బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు యాట నర్సింహ, జగన్, ప్రభాకర్ రెడ్డి, మానయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్ల కేశవరెడ్డి, హన్మనాయక్, భాస్కర్ రెడ్డి, కృష్ణానాయక్, శ్రీశైలం, కేఎస్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా, సురేశ్ నాయక్, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

వృత్తి, నైపుణ్య శిక్షణతో ఉపాధి

కడ్తాల్, అక్టోబర్ 17: వృత్తి, నైపుణ్య శిక్షణ తరగతులతో కార్మికులు, నిరుద్యోగులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్లంపల్లి పంచాయతీలో ఉన్న వంపుగూడెంలో భవన నిర్మాణ కార్మికులకు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని, శిక్షణలో కార్మికులు నేర్చుకున్న నిర్మాణ రంగ మెళకువలను పరిశీలించారు. న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి రోజుకు రూ.300 అందించడంతోపాటు భోజన వసతి కల్పించామన్నారు. శిక్షణా కాలంలో యూనిఫామ్స్, హెల్మెట్, ఇతర సామగ్రితో సర్టిఫికెట్లు అందజేశామని ఆయన పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ వ్యవస్థ

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 17: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుంటి కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలో ప్రతిరోజు నాలుగు నుంచి ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విద్యుత్ అధికారులను పలుమార్లు సంప్రదించినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో 300 ఇండ్లకు కలిపి ఒకటే ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దీంతో లోవోల్టేజీ సమస్య తీవ్రమవుతున్నదని తెలిపారు. వెంటనే పరిష్కారానికి విద్యుత్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

20న హమాలీ సంఘ సమావేశం

చేవెళ్లటౌన్, అక్టోబర్ 17: రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో ఈ నెల 20న హమాలీ సంఘం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి హమాలీలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా నిర్మాణ బాధ్యులు చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

మంచాల, అక్టోబర్ 17: మండల పరిధిలోని బోడకొండ గ్రామానికి చెందిన పలువురు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కొర్ర పాండు, బాలునాయక్, లచ్చిరాం నాయక్, దేవరాం నాయక్, జాటోతు శీను, కటికపల్లి శీనుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన

పూర్ణాహుతి హోమం చేస్తున్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 17: పట్టణంలోని శివమారుతీగీతా అ య్యప్ప మందిరంలో గురువారం దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా జరిగింది.కార్యక్రమంలో గురుస్వా మి గిరీషన్ నాయర్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, దాతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన దాతలు ఈశ్వరప్ప, చంద్రకాంత్, సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయ ణ, రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్రాంరెడ్డి, భక్తులు ప్రభాకర్, లింగమప్ప, కృష్ణయ్య, శివయ్య, అమర్‌నాథ్, విక్రంరెడ్డి, అంజయ్య, శేఖర్, అనిల్, నర్సింహ పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

డివైడర్‌పైకి దూసుకెళ్లిన సీఎన్‌జీ గ్యాస్ వాహనం

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో ఓ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటన తృటిలో ప్రమాదం తప్పింది. ట్టింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్ డిపో సమీపంలో గురువారం ఉదయం 10గంటల సమయంలో నగరం నుంచి నాగార్జునసాగర్ వైపు వెళ్తున్న సీఎన్‌జీ సిలిండర్ల వాహన డ్రైవర్‌కు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో వాహనం అదుపు తప్పి సాగర్ రహదారిపై ఉన్న డివైడర్‌పైకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన స్థానికులు డ్రైవర్‌ను ప్రమాదం నుంచి తప్పించారు. స్వల్పంగా గాయపడిన డ్రైవర్‌ను స్థానిక దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్‌కు సహకరించాలి

మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

షాద్‌నగర్ రూరల్, అక్టోబర్ 17: విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని షాద్‌నగర్ సీడీపీవో నాగమణి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలన్నారు. ఇందుకు వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మంజుల, శ్రీకాంత్, విజయలక్ష్మి, ప్రవీణ్, ప్రశాంతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సాబేరా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు అందజేత

విజేతలకు బహుమతులను అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్

షాద్‌నగర్, అక్టోబర్ 17: కొందుర్గు మండల కేంద్రంలో నాలుగు రోజుల పాటు కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ బహుమతులను అందజేశారు. వాల్మీకి ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాజేశ్‌పటేల్ పేర్కొన్నారు. క్రీడా పోటీలు గ్రామాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రజల మధ్య స్నేహబంధాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. మొదటి విజేతకు రూ.20వేల నగదుతో పాటు ట్రోఫీ, రెండో విజేతకు రూ.10వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేసినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు షాపుల్లో చోరీ

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 17: శంకర్‌పల్లిలోని చేవెళ్ల రోడ్డులో ఉన్న రెండు షాపుల్లో చోరీలు జరిగిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. బాధితులు, శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని చేవెళ్ల రోడ్డులో సంగమేశ్వర ఫర్టిలైజర్స్, వైష్ణవి హర్డ్‌వేర్ షాపుల యజమానులు రమేశ్, మల్‌రెడ్డి బుధవారం రాత్రి 9 గంటలకు షటర్స్ మూసి ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఉదయం షాపులు తెరిచి చూసేసరికి సంగమేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో రూ.17 వేలు, వైష్ణవి హర్డ్‌వేర్ షాపులో రూ.25 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. దుండగులు షటర్స్ తెరిచి నగదు అపహరణకు పాల్పడినట్లు పోలీసుల నిర్ధారణలో వెల్లడైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిబట్ల, అక్టోబర్ 17: ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ పార్వతీపురం సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యమైంది. గురువారం ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పార్వతీపురం కాలనీలో ఉన్న దుర్గామాత ఆలయం, ప్యారం ఆశ్రమం వెనుకాల ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలికి 55 ఏండ్లు ఉంటుందని, ఒంటిపై పింక్ కలర్ చీర, పసుపు రంగు బ్లౌజ్ ధరించి ఉందని, మృతదేహం పూర్తిగా కుళ్లి పోయింది. స్థానికంగా విచారణ చేపట్టగా ఆమె నాదర్‌గుల్ టాటా ఏరోస్పేస్ ప్రాంతాల పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నట్లు తెలిపారు. 10 రోజుల నుంచి ఈ ప్రాంతంలో తిరుగుతూ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుత్ డీఈగా గోపాలకృష్ణ

కందుకూరు, అక్టోబర్ 17: కందుకూరు డివిజన్ విద్యుత్ నూతన డీఈగా గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఆయనతో పాటు మండల ఏఈగా విష్ణువర్ధన్ రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీఈతో పాటు ఏఈ రమేశ్ గౌడ్ బదిలీ కావడంతో వారి స్థానాల్లో గోపాలకృష్ణ విష్ణువర్దన్ రెడ్డిలను నియమించారు. దీంతో వారు పదవీ బాధ్యతలు చేపట్టారు.

కడ్తాల్: వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు

పెద్దఅంబర్‌పేట: వాల్మీకి జయంతి వేడుకలో చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ తదితరులు

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

తుర్కయాంజాల్: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ అధికారులు

కడ్తాల్ (తలకొండపల్లి), అక్టోబర్ 17: ఆదికవి వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి రామాయణం రచించి ప్రపంచానికి తెలియజేశారని తెలిపారు. నేటి తరం యువత వాల్మీకి జీవిత చరిత్రను తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ స్వామి, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, నాయకులు కృష్ణయ్య, రేణురెడ్డి, మహేశ్, రాజేందర్, అశోక్, శ్రీను, మచ్చేందర్, అనంతరాములు, రమేశ్, అంజయ్య, రాజు, రమేశ్, శేఖర్, జీవా తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేటలో..

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 17: పెద్దఅంబర్‌పేటలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ అధ్యక్షతన వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రోహిణిరెడ్డి, పసుల రాజేందర్, మండల కోటేశ్వర్‌రావు, కమిషనర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్‌లో..

తుర్కయాంజాల్, అక్టోబర్ 17: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్, ఆర్‌వో శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతల ప్రోత్సాహం ఎంతో అవసరం

పాఠశాలలో క్రీడా సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

షాబాద్, అక్టోబర్ 17: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు దాతల ప్రోత్సాహం ఎంతో అవసరమని తాళ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 1984-85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల క్రీడా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మా ట్లాడుతూ... పేద విద్యార్థులను దాతలు ప్రో త్సహిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమంలో దో స్వాడ నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, పీసరి మనోహర్‌రెడ్డి, బండ మహేందర్‌గౌడ్, కద్మూ రి లక్ష్మయ్య తదితరులున్నారు.

ఆలయాలపై దాడులకు పాల్పడిన దుండగులను శిక్షించాలి

మాట్లాడుతున్న మండల ప్రధాన కార్యదర్శి అతెల్లి అనంత్ రెడ్డి

చేవెళ్లటౌన్, అక్టోబర్ 17: ఆలయాలపై దాడులకు పాల్పడిన దుండగులను ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అతెల్లి అనంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. గురువారం చేవెళ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముత్యాలమ్మ గుడిలో విధ్వంసం సృష్టించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండడంతో పాటు కఠినమైన చట్టాలను తీసుకు రావాలన్నారు. హింసను ప్రేరేపించే వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ ఘటనపై ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు అంజనేయులు గౌడ్, చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు శర్వలింగం, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 17: బీజాపూర్ రహదారిపై ఆటోలో నుంచి ఎగిరిపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం మర్కల్ గ్రామానికి చెందిన పుట్ట శంకర్ (21), రాములు నగరం చుట్టూ జరిగే సంతల్లో చేపలు అమ్మేందుకు నిత్యం ఆటోలో వెళ్లేవాడు. గురువారం చేవెళ్ల మార్కెట్లో చేపలు అమ్మేందుకు ఆటోలో వెళ్తుండగా చేవెళ్ల మండల పరిధిలోని కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఒకవైపు ఒరగడంతో అందులో నుంచి శంకర్, రాములు రోడ్డుపై పడిపోయారు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. నలుగురికి గాయాలు

యాచారం, అక్టోబర్17: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ క్రీడా క్షేత్రం సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా చందంపేట మండలం మురుపునూతల గ్రామానికి చెందిన గొడుగు తిరుపతయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి తన ఆటోలో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మండలంలోని గున్‌గల్ క్రీడా క్షేత్రం వద్దకు రాగానే వెనకాల నుంచి కారు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో తిరుపతయ్యతో పాటు నక్క వెంకటమ్మ, మెండె చంద్రకళ, గెనబోయిన సరితలు గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో ఇబ్రహీంపట్నంలోరి ఓ ప్రైవేటు దవాఖానాకు తరలించారు. పోలీసులు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులకు 2నెలల జైలు

యాచారం, అక్టోబర్ 17: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో 2020లో ఓ రైతు పొలంలోకి అక్రమంగా ప్రవేశించి నష్టం కలిగించిన ఇద్దరు నిందితులకు ఇబ్రహీంపట్నం సివిల్ కోర్టు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించింది. సీఐ కృష్ణంరాజు తెలిపిన వివరాలు.. కందుకూరు మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన రైతు పొలంలో ఎరగదిండ్ల పెద్ద ఈదయ్య, సత్తయ్య అక్రమంగా ప్రవేశించి పంట పొలానికి నష్టం చేకూర్చారు. బాధిత రైతు పోలీసులను ఆశ్రయించారు. దీనికి సంబంధించి ఇబ్రహీంపట్నం కోర్టు జడ్జి హిమబిందు తీర్పును వెల్లడించింది. రైతులకు నష్టం చేకూర్చిన సత్తయ్య, పెద్ద ఈదయ్యలకు రూ.2500 జరిమానా లేదా 2నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

షాబాద్: మద్దూర్ రాంసింగ్ తండాలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్

మొయినాబాద్: నజీబ్‌నగర్‌లో పశువుకు టీకా ఇస్తున్న డాక్టర్ దేవిరెడ్డి

షాబాద్, అక్టోబర్ 17: గ్రామాల్లో రైతులు తమ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని మద్దూర్, రాంసింగ్‌తండా, మక్తగూడ, కుమ్మరిగూడ, కక్కులూర్ తదితర గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రతలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, కృష్ణమూర్తి, సుధాకర్, శ్రీకాంత్, బలరాం, రాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

మొయినాబాద్, అక్టోబర్ 17: పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నజీబ్‌నగర్, చిలుకూరు, కనకమామిడి, సురంగల్, పెద్దమంగళారం, అజీజ్‌నగర్ గ్రామాల్లో పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రైతు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 17: ఆవులు, గేదెలకు వచ్చే రోగాల నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ వైద్యురాలు సౌమ్య అన్నారు. మూగజీవాలకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న గాలికుంటు నివారణ టీకాలు గురువారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ప్రతి ఒక్క రైతు తమ ఆవులు, గేదెలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల మిత్రుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో..

ఆమనగల్లు, అక్టోబర్ 17: ఆమనగల్లు మండల పరిధిలోని శెట్టిపల్లిలో గురువారం 363 ఆవులకు, 3 గేదెలకు ఉచితంగా గాలి కుంటు నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారి డాక్టర్ అగ్నివేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ పాడి రైతులు వారి పశువులకు టీకాలు వేసుకుని వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానోద్దీన్, ఫాలాక్ష, హరీశ్, రమేశ్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

కొత్తగూడలో..

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 17: రైతులు తమ పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలని శంకర్‌పల్లి మండల పశువైద్యాధికారి మానసారెడ్డి అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిధి కొత్తగూడలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న మందులను రైతులు తమ పశువులకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ వంటేరు రాజ్యలక్ష్మి, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్ (తలకొండపల్లి), అక్టోబర్ 17: తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన గిరమోని శాంతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.3 వేలు, కాంగ్రెస్ పార్టీ తరపున రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామస్వామి, నాయకులు యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, పెంటయ్య, అంజయ్య, శేఖర్, మల్లేశ్, చెన్నయ్య, కృష్ణయ్య, భగవంత్, శ్రీశైలం, వినోద్, ప్రశాంత్, సతీశ్, భాస్కర్, రవి, సుధాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.